
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



సోమశిలకు 30,871 క్యూసెక్కులు

సోమశిల: సోమశిల జలాశయానికి వరద ఉధృతి పెరుగుతోంది. పొతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా 30,871 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. 43.776 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,03,120
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,297
3 శాతం జీఎస్టీతో	రూ.9,576
నవర (8 గ్రా)	రూ.76,608

గరిష్టం/కనిష్టం
32.6 /25.7

వాతావరణం

జిల్లాలో ఆకాశం శుక్రవారం మేఘావృతమయ్యే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 60 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద పనులు

• నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు 45 రోజుల పాటు జరగనుండటంతో ట్రాఫిక్‌ను శుక్రవారం నుంచి దారి మళ్లించనున్నామని ఎస్పీ కృష్ణకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గాం. దీబొమ్మ వైపు నుంచి వచ్చే వాహనాలను వీఆర్సీ సెంటర్, ఏసీ మార్కెట్, ఆర్టీసీ, కేవీఆర్ మీదుగా.. ఆత్మకూరు బస్టాండ్, ముత్తుకూరు వైపు నుంచి రామలింగాపురం మీదుగా వీఆర్సీ సెంటర్‌కు వచ్చే వాహనాలను మినీ బైపాస్ మీదుగా దారి మళ్లించామని చెప్పారు. అన్నమయ్య సర్కిల్ వైపు నుంచి రామలింగాపురం మీదుగా వీఆర్సీ సెంటర్‌కు వచ్చే వాహనాలను ఆత్మకూరు బస్టాండ్ వైపు మళ్లించామని వివరించారు.

స్త్రీ శక్తి పథకం ప్రారంభం నేడు

నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో స్త్రీ శక్తి పథకాన్ని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ శుక్రవారం సాయంత్రం ఐదుకు ప్రారంభించనున్నారని ప్రజా రవాణా శాఖ అధికారి షమీమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆనంద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారని చెప్పారు.

17న అండర్ - 23 క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెట్ అండర్ - 23 జట్టును నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గల క్రికెట్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 17న ఎంపిక చేయనున్నామని క్రికెట్ సంఘ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ సొంత కిట్, వైట్ డ్రస్ కోడ్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

332 మందికి అవార్డులు

• స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నేడు ప్రదానం

నెల్లూరు(అర్బన్): విధి నిర్వహణలో విశిష్ట సేవలందించినందుకు గానూ 332 మంది అధికారులు, ఉద్యోగులకు అవార్డులను కలెక్టర్ ఆనంద్, మంత్రి నారాయణ చేతుల మీదుగా ఇవ్వనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించనున్న కార్యక్రమంలో వీటిని అందజేయనున్నారు. జిల్లా అధికారులకు సంబంధించి జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి నాగేశ్వర్, జిల్లా సహకార శాఖాధికారి గుర్రప్ప, ఆత్మకూరు ఆర్డీఓ పావని, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ తదితరులున్నారు. 71 ప్రభుత్వ శాఖల నుంచి 323 మందికి.. మరో తొమ్మిది మందికి ప్రైవేట్ అవార్డులను ప్రకటించారు. ఇప్పటి వరకు 332 అవార్డులను ప్రకటించినా, ప్రదానం చేసే సమయానికి ఈ సంఖ్య పెరగొచ్చని సమాచారం.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సమాచార హక్కు చట్టంపై నగరంలో అవగాహన ర్యాలీని జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మినీబైపాస్‌రోడ్డులో సహకార శాఖ ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీలో భాగస్వాములయ్యారు. అనంతరం సహకార శాఖ ఆడిట్ అధికారి కార్యాలయంలో ఉద్యోగులకు అవగాహన సదస్సును నిర్వహించారు. సమాచార హక్కు చట్టంపై డీసీఓ గుర్రప్ప పలు సూచనలు చేశారు. డీసీఏఓ తిరుపాల్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చేదే అరకొర.. అందులోనూ కోతే

జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో పనిచేస్తున్న కోచ్‌లు, నాలుగో తరగతి ఉద్యోగులు ఏడాదిగా జీతాల్లేక అవస్థ పడుతున్నారు. వీరి కష్టాన్ని గుర్తించి ప్రతి నెలా అందజేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేసింది. తాజాగా వీరికి మరో షాక్ ఇచ్చింది. ఏడాదికి సంబంధించిన జీతాల్లో సగాన్నే జమ చేసి గందరగోళానికి గురిచేసింది. అసలు ఇలా ఎందుకు వ్యవహరించారనే అంశంపై ఎవరి వద్దా స్పష్టత లేకపోవడం గమనార్హం.

- డీఎస్ఏ ఉద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు
- ఏడాదిగా జీతాల్లేక ఆర్తనాదాలు
- ఎట్టకేలకు జమచేసినా.. అదీ సగమే
- క్రీడారంగ అభివృద్ధెలా..?

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): క్రీడాప్రాధికార సంస్థ నిర్వహణ తీరు లోపభూయిష్టంగా మారింది. వాస్తవానికి ఇక్కడ పనిచేసే కాంట్రాక్ట్ కోచ్‌లు, నాలుగో తరగతి ఉద్యోగులకు ఇచ్చే జీతమే స్వల్పం. ఈ మొత్తాన్నీ ఏడాది పాటు నిలిపి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. దీనిపై కలెక్టర్ మొదలుకొని ప్రజాప్రతినిధులు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఎలాంటి ప్రయోజనం లభించలేదు. ఈ అంశమై 'జీతాల్లేవ్.. క్రీడల్లో శిక్షణ ఇచ్చేదెలా' అనే శీర్షికన సాక్షిలో జూన్ 29న కథనం ప్రచురితమైంది. దీంతో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ అధికారులు రెండు నెలల తర్వాత సమావేశాన్ని ఏర్పాటు చేసి జీతాలిస్తామని ప్రకటించారు.

అకౌంట్ చూసి.. నిర్ఘాంతపోయి..!

ఎట్టకేలకు వారి బ్యాంక్ ఖాతాల్లో జీతాలు బుధవారం రాత్రి జమయ్యాయి. అయితే సగమే పడటంతో నిర్ఘాంతపోవడం వారి వంతైంది. ఇలా ఎందుకు వ్యవహరించారనే విషయమై రాష్ట్ర, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు నోరు మెదపడంలేదు.

జమైంది ఇలా..

డీఎస్ఏలో పనిచేసే కోచ్‌లకు జీతం రూ.21,500 కాగా, జమైంది రూ.12 వేలు. డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంటెంట్లకు రూ.20 వేల జీతం కాగా, వచ్చింది రూ.15 వేలే. ఆఫీస్ సబార్డినేట్, గ్రౌండ్స్ మార్కర్, స్వీపర్, వాచ్‌మెన్, ఇండోర్ స్టేడియం అటెండర్లు, క్లీనర్లకు రూ.15 వేలు ఇవ్వాల్సి ఉండగా, రూ.ఎనిమిది వేలను అందజేశారు. స్విమ్మింగ్ పూల్ స్వీపర్లు, వాచ్‌మెన్లు, ఎలక్ట్రీషియన్, వెంకటగిరి, గూడూరు సబ్ సెంటర్ల కేర్ టేకర్లు, ఓజిలి సబ్ సెంటర్ వాచ్‌మెన్‌కు ఇచ్చే జీతం రూ.15 వేలు కాగా, రూ.ఎనిమిది వేలనే జమ చేశారు.



ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం

అప్పులను ఎలా తీర్చాలో..?

వీరికిచ్చే జీతాలు అంతంతమాత్రమే. ఏడాది పాటు వేతనాలను నిలిపి అందులోనూ సగమే జమచేయడంతో ఉద్యోగులు కన్నీటిపర్యంతమయ్యారు. అప్పులను ఎలా తీర్చాలో పాలుపోక వీరు సతమతమవుతున్నారు. ఈ పరిణామాలతో జిల్లాలో క్రీడా రంగం అస్తవ్యస్తంగా మారే ప్రమాదం ఉంది. జీవితాలు బాగుండాలంటే క్రీడల్లో పాల్గొనాలని చెప్పే అధికారులు, ప్రజాప్రతినిధులు వీరిని విస్మరిస్తున్నారు. ఈ ఏడాది క్రీడా పరికరాలు, మైదానాల అభివృద్ధికి ఎలాంటి ఆర్థిక సాయం చేయని కూటమి ప్రభుత్వం ఉద్యోగులనూ విస్మరించి తన మార్కును ప్రదర్శించింది.

శాప్ అధికారులకు తెలియజేశాం

సగం జీతాలే జమయ్యాయనే అంశాన్ని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ అధికారులకు తెలియజేశాం. పూర్తిగా జీతాలొచ్చేందుకు అధికారులతో కలిసి యత్నిస్తాం.

– యతిరాజ్, డీఎస్డీఓ

బలవంతపు భూసేకరణ దారుణం



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఉదయగిరి: పరిశ్రమల పేరిట రాష్ట్రంలోని రైతుల నుంచి భూములను బలవంతంగా సేకరించేందుకు ప్రభుత్వం యత్నిస్తుండటం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో కార్యకర్తలతో సమావేశాన్ని గురువారం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు, ప్రజల పొట్టగొట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. కరేడులో ఇండోసోల్ కంపెనీకి ఎనిమిది వేల ఎకరాలను కట్టబెట్టేందుకు యత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. తమ భూములను ఇవ్వబోమంటూ నెల రోజులుగా రైతులు, ప్రజలు పోరాటాలు చేస్తున్నా, ప్రభుత్వంలో కనీస స్పందన లేకపోవడం దారుణమన్నారు. లింగసముద్రం మండలం మాలకొండ ఆలయం చుట్టూ ఉన్న నాలుగు గ్రామాల పరిసర భూముల్లో 19 చదరపు కిలోమీటర్ల మేర ఇనుప ఖనిజం ఉందని, వీటిని జిందాల్ కంపెనీకి కట్టబెట్టేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. వరికుంటపాడు పంచాయతీ జంగంరెడ్డిపల్లె తిప్పపై ఇచ్చిన మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని సంఘాలతో కలిసి చలో కరేడు కార్యక్రమాన్ని ఈ నెల 18న నిర్వహించనున్నామని వెల్లడించారు. సీపీఎం నేతలు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, ఫరిద్దీన్‌బాషా, వెంకటేశ్వర్లు, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారుల అప్రమత్తంగా ఉండాలని జేసీ కార్తీక్ ఆదేశించారు. కలెక్టరేట్లోని శంకరన్ సమావేశ మందిరంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 1077, 79955 76699, 0861 – 2331261 కంట్రోల్ రూమ్ నంబర్లు, డివిజన్, మండల కేంద్రాల్లోని కాల్ సెంటర్లు, స్థానిక సచివాలయాలను సంప్రదించాలని కోరారు. డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, మత్స్యశాఖ జేడీ శాంతి, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, ఇరిగేషన్, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్ఈలు దేశ్‌నాయక్, వెంకటరమణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌తో నాకెలాంటి సంబంధం లేదు

• పోలీసుల విచారణలో బిరదవోలు వెల్లడి

సాక్షిప్రతినిధి, నెల్లూరు: రాజకీయ కక్షతోనే తనపై అక్రమ కేసును కూటమి నేతలు బనాయించారని, మైనింగ్‌తో తనకెలాంటి సంబంధం లేదంటూ పోలీసుల కస్టడీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారని సమాచారం. పొదలకూరు మండలం తాటిపర్తి మైనింగ్ కేసులో మూడు రోజుల పోలీస్ కస్టడీ గురువారంతో ముగిసింది. చివరి రోజున డీటీసీలో పోలీస్ అధికారులు ఆయనకు 23 ప్రశ్నలేయగా, లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. తనది మనుబోలు మండలం మడమనూరు అని.. రాజకీయంగా మాజీ మంత్రులు అనిల్‌కుమార్‌యాదవ్, కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పరిచయమని.. తమ ఊరి సమస్యలపై వీరితో మాట్లాడేవాడినని.. రుస్తుం మైన్స్‌తో పాటూ క్వార్ట్జ్ వ్యాపారాలతో ఎలాంటి సంబంధం లేదని.. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అక్రమ కేసని బిరదవోలు వెల్లడించారని తెలిసింది.





పచ్చ పైత్యం పరాకాష్టకు..!

జాగా కనిపించిందా.. దానికి పచ్చ రంగ పులిమేందుకు టీడీపీ అధిక ప్రాధాన్యమిస్తోంది. తాజాగా ఈ జాఢ్యం ఆర్టీసీ బస్సులకు పాకింది. స్త్రీ శక్తి పథకాన్ని శుక్రవారం ప్రారంభించనున్న తరుణంలో పల్లె వెలుగు బస్సు లోపల సీట్ల వెనుక భాగం, రాడ్లు తదితరాలను పచ్చ రంగుతో నింపేశారు. దీన్ని చూసి నివ్వెరపోవడం ప్రయాణికుల వంతవుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

18న చలో కరేడు



పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన తలపెట్టిన చలో కరేడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పిలుపునిచ్చారు. నెల్లూరులోని బాలాజీనగర్‌లో ఉన్న ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూములు ఇచ్చేది లేదని గ్రామసభలో రైతులు తేల్చిచెప్పారన్నారు. అయితే ఎమ్మెల్యే, కలెక్టర్ గ్రామ రైతుల మధ్య చీలిక తెచ్చి భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చలో కరేడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలిన కోరారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. సమావేశంలో నాయకులు రాంబాబు, చంద్ర రాజగోపాల్, దామా అంకయ్య, షాన్‌వాజ్, మాదాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఒకరికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలం పంగిలి గ్రామానికి చెందిన కె.నరసింహులుకు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీకాంత్ గురువారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్లు బాబు ప్రసాద్, రఘు, ఫారెస్ట్ అధికారి చక్రపాణి తెలిపిన వివరాల మేరకు.. 2014 మార్చి 5వ తేదీ నెల్లూరు డివిజన్, రాపూర్ ఫ్లైయింగ్ స్క్వాడ్ ఫారెస్ట్ సిబ్బంది సైదురాజులపల్లి రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో గూడ్స్ క్యారియర్ వాహనం ఫారెస్ట్ సిబ్బందిని చూసి వారికి దూరంగా ఆగింది. ఆ వాహనంలోని ముగ్గురు పరారయ్యారు. అయితే వారిలో నిందితుడు నరసింహులును మాత్రం ఫారెస్ట్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. 436 కిలోల 17 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నరసింహులును విచారించగా మరో ఇద్దరి పేర్లను తెలిపాడు. దీంతో ఫారెస్ట్ సిబ్బంది వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం నరసింహులుపై మాత్రం రుజువు కావడంతో న్యాయమూర్తి అతడికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మరో ఇద్దరిపై కేసును కొట్టేస్తూ తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ నిర్మల వాదించారు.

నెల్లూరు జైలుకు తరలింపు

నెల్లూరు(అర్బన్): కోర్టు శిక్ష విధించిన నరసింహులును నెల్లూరు జైలుకు తరలిస్తున్నట్లు ఫారెస్ట్ రాపూరు రేంజర్ రవీంద్ర తెలిపారు. ఎర్రచందనాన్ని అక్రమంగా తరలించినా, రవాణాకు సహకరించినా కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఆరు లేన్లున్నా.. ఆర్తనాదాలే

అటు.. ఇటు మూడు వరుసలు.. వాహనాలు వెళ్లేందుకు వీలుగా తీర్చిదిద్దిన జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆరు లేన్లుగా ఉన్నా.. ప్రయాణికుల ఆర్తనాదాలు వినిపిస్తూనే ఉన్నాయి. అతివేగం, నిద్రమత్తు తదితర కారణాలతో హైవేపై జరుగుతున్న యాక్సిడెంట్లతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రయాణమంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. సింగరాయకొండ నుంచి తెట్టు వరకు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. – ఉలవపాడు

- 11 నెలల్లో 15 మంది మృతి.. 54 మందికి గాయాలు
- ఇటీవల ఏడుగురి దుర్మరణం
- అతివేగం, నిద్రమత్తే కారణం
- ప్రమాదాల నివారణకు చర్యలు శూన్యం
- ఉలవపాడులోని జాతీయ రహదారిపై ఇదీ పరిస్థితి



ప్రమాదాలు అధికంగా జరిగే రాజుపాళెం జంక్షన్



హైవేపై రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదం

దారుణ వైఫల్యం

ప్రమాదాలు అధికమవుతున్నా, నివారణ చర్యలను చేపట్టడంలో హైవే అథారిటీ, పోలీస్, రవాణా శాఖ అధికారులు విఫలమవుతున్నారు. రోజురోజుకూ ఇవి ఎక్కువవుతున్నాయే తప్ప, తగ్గుముఖం పట్టడంలేదు. యాక్సిడెంట్లు జరిగే ప్రాంతాలను పోలీస్ అధికారులు ఏడాది క్రితం పరిశీలించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించినా, క్షేత్రస్థాయిలో ఎలాంటి జాగ్రత్తలను చేపట్టిన దాఖలాల్లేవు.

ఎన్నో కారణాలు

జాతీయ రహదారిపై ప్రమాదాలకు ఎన్నో కారణాలు కనిపిస్తున్నాయి. అతివేగం.. నిద్రమత్తు ప్రధానంగా నిలుస్తోంది. మితిమీరిన వేగం.. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో భారీ మూల్యం ఎదురవుతోంది. ఉలవపాడు మండల పరిధిలో హైవేపై అండర్ పాస్‌లు లేకపోవడంతో మలుపులు తిరుగుతున్నప్పుడు.. రోడ్డును క్రాస్ చేసే సమయాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మండల పరిధిలోని కరేడు ర్యాంపు, మన్నేటికోట అడ్డ రోడ్డు, ఉలవపాడు ఉత్తర, దక్షిణ బైపాస్‌లు, రాజుపాళెం, వీరేపల్లి జంక్షన్లలో అండర్ పాస్‌లు కానరావడంలేదు. రాజుపాళెం నుంచి చాగల్లు జంక్షన్ మధ్యలో ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్నాయి. 50 శాతం వరకు ఇక్కడే చోటుచేసుకుంటున్నాయి.

విచ్చలవిడిగా మద్యం

జాతీయ రహదారిపై మద్యం విచ్చలవిడిగా లభిస్తుండటంతో డ్రైవర్లు తాగి వాహనాలను నడపడం సైతం ప్రమాదాలకు కారణమవుతోంది. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని పలువురు హెచ్చరిస్తున్నా, వాహనచోదకులు పెడచెవిన పెడుతున్నారు.

ప్రమాద ఘంటికలు

జాతీయ రహదారిపై ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రెండు రోజుల్లో చోటుచేసుకున్న యాక్సిడెంట్లలో ఏడుగురు మృతిచెందారు. కొద్దిరోజుల క్రితం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. మరుసటి రోజు మరొకరు చనిపోయారు. మండల పరిధిలో పది నెలల్లో 15 మంది మృత్యువాత పడగా, 54 మంది క్షతగాత్రులయ్యారు. జిల్లాలో అత్యధిక ప్రమాదాలు మండల పరిధిలోనే జరుగుతున్నాయి. రక్తమోడుతున్న హైవేపై ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మన్నేటికోట జంక్షన్ వద్ద కానిరాని అండర్ పాస్

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- జూన్ 2న.. అరుణాచలం వెళ్తున్న కారు మన్నేటికోట అడ్డ రోడ్డు వద్ద బోల్తా పడటంతో ఐదుగురు గాయపడ్డారు.
- ఆరున.. చాగల్లు వద్ద డివైడర్‌ను కారు ఢీకొనడంతో నలుగురు క్షతగాత్రులయ్యారు.
- 30న.. రాజుపాళెం జంక్షన్ వద్ద ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు.
- జూలై ఏడున.. చిల్ల కాల్వపై కారును ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు.
- ఆగస్ట్ 7న వీరేపల్లి వద్ద ట్యాంకర్‌ను లారీ ఢీకొనడంతో డ్రైవర్ చనిపోయాడు.
- ఎనిమిదిన.. ట్రాలీని తుఫాన్ వాహనం ఢీకొనడంతో ఐదుగురు మృతి చెందారు. ఇదే సమయంలో మూడు వాహనాలు ఢీకొన్నాయి.
- తొమ్మిదిన.. రెండు ద్విచక్ర వాహనాలను కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు.

చర్యలేవీ..?

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు శూన్యంగా ఉంటున్నాయి. యాక్సిడెంట్ జోన్లను గుర్తించినా అక్కడ వేగ నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. హైవేపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలుపుతున్నా, పట్టించుకునే నాథుడే లేరు. ఇక డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను గాలికొదిలేశారు. ప్రయాణికులు సైతం తమ స్వీయ భద్రతను విస్మరిస్తుండటంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: ఆటో అదుపుతప్పి ప్రమాదానికి గురైన డ్రైవర్ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. రూరల్ పరిధిలోని కల్లూరుపల్లిలో టి.ధనంజయ (43) నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య, పిల్లలున్నారు. ఈనెల 9వ తేదీన నగరంలోని కూరగాయల మార్కెట్‌లో పండ్లు కొనుగోలు చేసేందుకు నెల్లూరుకు ఆటోలో బయలుదేరాడు. ఇంటి నుంచి కొంత దూరం వచ్చాక కుక్క అడ్డు రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన ధనంజయ చికిత్స పొందుతూ చనిపోయాడు. రూరల్ సీఐ వేణు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు



పరేడ్ గ్రౌండ్‌లో చేసిన ఏర్పాట్లు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్



కవాతు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు నెల్లూరు నగరంలోని పోలీసు కవాతు మైదానం సిద్ధమైంది. పోలీస్ వందనం స్వీకరణ, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. గురువారం ఎస్పీ జి.కృష్ణకాంత్ సన్నాహక ఏర్పాట్లను పరిశీలించారు. కవాతు రిహార్సల్స్‌ను పరిశీలించారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలిచ్చారు. శుక్రవారం జెండా వందనానికి విచ్చేసే ముఖ్యఅతిథులకు గౌరవార్థం ఇచ్చే వందన సమర్పణ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరిని డీఎంఎఫ్‌డీ ద్వారా తనిఖీ చేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్బీ, ఏఆర్ డీఎస్పీలు ఎ.శ్రీనివాసరావు, ఎస్.చంద్రమోహన్, ఆర్ఐలు అంకమరావు, రాజారావు, హరిబాబు, పాల్‌రాజు, శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు, ఆర్ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 27.170 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 27.170 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 6,600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,800, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.40
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.120
లేయర్	రూ.118
బ్రాయిలర్ చికెన్:	రూ.220
స్కిన్‌లెస్ చికెన్:	రూ.244
లేయర్ చికెన్:	రూ.200

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.8 లక్షల ఆస్తి నష్టం
- లబోదిబోమంటున్న బాధితులు





అగ్నికి ఆహుతైన సామగ్రి (ఇన్‌సెట్లో) బూడిదైన నగదు

కొడవలూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమవడంతో ఓ కుటుంబం సర్వం కోల్పోయింది. ఈ ఘటన మండలంలోని గండవరం పూలతోట గాడికయ్యల్లో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గోళ్ల ప్రసాద్, లక్ష్మి దంపతులు కూలీ పనులకు వెళ్తుంటారు. రోజూలాగే గురువారం ఉదయం పనికెళ్లారు. వారింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. వస్తువులు పూర్తిగా తగులబడే వరకూ చుట్టుపక్కల వారు గుర్తించలేకపోయారు. కొంతసేపటి తర్వాత వాసన రావడం, కిటికీలో నుంచి పొగ వస్తుండటంతో గుర్తించి బాధితులకు సమాచారం అందించారు. వారు ఇంటికి చేరుకోగా అప్పటికే బీరువా, రిఫ్రిజిరేటర్, మంచం, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయింది. పనికెళ్లి పొదుపు చేసి బీరువాలో దాచిన రూ.3 లక్షల నగదు, రూ.3 లక్షల విలువైన బంగారు నగలు, రూ.2 లక్షల విలువైన సామగ్రి తగులబడిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. గ్రామానికి చెందిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి వారిని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

భలే కేటుగాళ్లు

- సెల్‌ఫోన్లు చోరీ చేసి బ్యాంక్ ఖాతాల్లో నగదు హాంఫట్
- ముగ్గురి అరెస్ట్
- నిందితులు హైదరాబాద్, అన్నమయ్య జిల్లా, నెల్లూరు వాసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

తిరుపతి క్రైమ్: సెల్‌ఫోన్లు చోరీ చేసి అందులోని బ్యాంక్ ఖాతా నగదు హాంఫట్ చేస్తున్న కేటుగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఈస్ట్ పోలీస్ స్టేషన్లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన హరికృష్ణ, అన్నమయ్య జిల్లాకు చెందిన అశోక్, నెల్లూరు జిల్లాకు చెందిన గడ్డం కాసిరెడ్డి ముఠాగా ఏర్పడి నగరంలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడేవారు. వాటిలో ఫోన్ పే, గూగుల్ పేను పరిశీలించి అందులో నగదును సరికొత్త ఎత్తుగడలతో కొట్టేసేశారు. ఏటీఎం సెంటర్ వద్ద కాపు కాసి, అక్కడ వచ్చే వారికి తమ వారు హాస్పిటల్లో ఉన్నారని, డబ్బులు చాలా అవసరమని ఫోన్ పే చేస్తామని, కావాలంటే కమీషన్ కూడా ఇస్తామని నమ్మిస్తారు. ఇలా చెప్పి వీరంతా రూ.3.6 లక్షలు కాజేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. హరికృష్ణ నుంచి రూ.లక్ష, 40 సెల్‌ఫోన్లు, అశోక్ నుంచి రూ.90 వేలు, 6 ఫోన్లు, కసిరెడ్డి నుంచి రూ.90 వేలు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్సై హేమాద్రి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో..

- బంగారం, వెండి చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన నెల్లూరు మూలాపేట రాజీవ్ గృహకల్పలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజీవ్ గృహకల్ప సముదాయంలో నారాయణమ్మ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె బుధవారం తన కుటుంబంతో కలిసి బంధువుల వివాహానికి వెళ్లింది. ఈలోగా గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను కూడా పగలగొట్టి అందులో ఉన్న సుమారు 28 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి కాళ్లపట్టీలు, రూ.3 వేలను అపహరించారు. గురువారం ఇంటికి వచ్చిన బాధితురాలు చోరీ జరిగినట్లు గుర్తించింది. వెంటనే ఈ ఘటనపై చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.